
కథ



# నెమలి కన్న కల

**తి. శైలజ**

మబ్బుచాటున తొంగి చూస్తున్న వెన్నెలమ్మ. కొబ్బరాకుల గలగలలు. గోదావరి మీద నుండి వీచే చల్లగాలి సంగీతాలు. ఇంటి వసారాలో పడుకున్న నాకు నిద్రరావడం లేదు. తెల్లవారితే సంక్రాంతి. ఊరంతా సంక్రాంతి సంబరాలతో సందడిగా ఉంది. అన్ని పండుగల కంటె ఈ పండుగకు పల్లెటూర్లలో చాలా ప్రాముఖ్యం ఉంది. పగడాలు, రంగురాళ్లు కలిపి పోసినట్లుగా ముంగిట వేసిన ఆ ముత్యాలముగ్గులు. బసవన్నను తోలుకుని వచ్చే బసవదాసరులు. రంగురంగుల కాగితాలతో అలంకరించిన పశువులు, కొత్తగా ఇంటికి చేరిన ధాన్యపు వాసనలతో, పిండివంటల గుభాళింపులతో ఏకోణం నుండి చూసినా ఈ పండగకు ప్రాముఖ్యం ఉంది. అందుకే ఈ పండగ అంటే నాకెంతో ఇష్టం. అన్ని పండగల కంటె సంక్రాంతి పండగ కోసం ఎదురుచూడడం అలవాటైపోయింది.

ఆరోజంతా తనూ, గౌతమ్ కలిసి అందరి ఇళ్లకు వెళ్లడం. ఇంటి పెరట్లో పశువులనలంకరిస్తున్న పాలేర్లతో కూర్చుని కబుర్లు చెప్పుకోవడం. ఆరోజు అమ్మవాళ్లకు తాము దొరికితేగా.... గౌతమ్ నాన్నగారి అక్కయ్య కొడుకు. అత్తయ్యవాళ్లు అక్కడే ఉంటారు. సిటీలో ఉన్న మేము పండగలకు అక్కడికి వెళ్లివస్తూ ఉంటాం. అక్కడికి వెళ్లినప్పుడు నాకు ఊరంతా తిప్పి చూపించడం గౌతమ్ డ్యూటీ... గోదావరి గట్టుమీద కూర్చుని ఎన్నో కబుర్లు... అలా ఎన్నో జ్ఞాపకాలతో నిండిపోయిన సంక్రాంతి అంటే నాకెంతో ఇష్టం.

చటుక్కున మెలకువ వచ్చింది. హఠాత్తుగా నిద్రమేల్కొన్న నా కళ్లకు మొదటి చీకటి తప్ప ఏమీ కనిపించలేదు. నెమ్మదిగా అది కోనసీమలోని తాతగారి ఊరు కాదని, కొబ్బరాకుల గలగలలు, గోదావరి సంగీతాలు అక్కడ వినబడదని. అది భాగ్యనగరంలో తాము నివసించే ఒకానొక ఫ్లాట్‌లోని అతిమామూలు బెడ్‌రూం అని అర్థం అయ్యేటప్పటికి నిస్పృహగా అనిపించింది. ఓహ్.. అదంతా కలేనన్నమాట! ఎన్నేళ్లయినా ఆ ఊరును, ఆ ప్రకృతిని తను మరచిపోలేక పోతోంది. ఈ పట్టణాల్లో పరుగుల జీవితంతో విసిగిపోయిన నాకు ఆ బాల్యస్మృతులే బంగారు కలలు.

చిన్నప్పుడు తరచుగా పల్లెకు వెళ్లే తాము చదువులు పెరిగే కొలది శెలవుల్లో కూడా కోచింగ్‌లంటూ బిజీగా ఉండడంతో పల్లెకు వెళ్లడం తగ్గించేశాము. ఇప్పుడు దాదాపు ఆ ఊరును మరచిపోయాననే చెప్పాలి.

"నందా... రేపు మీరు ఊరెళ్లిపోతున్నారటగా" దిగులుగా అడిగే గౌతమ్ మొహం ఇప్పటికీ తనకు గుర్తే.

నాన్నగారికి మన సంస్కృతి మీద సాహిత్యం మీద అభిలాష ఎక్కువ. తను పుట్టినప్పుడు ఎర్రగా అందంగా ఉండేదట.. అందుకే తనకు 'అలకనంద' అంటూ పేరు పెట్టారు. ఆ పేరు చాలామందికి చిత్రంగా అనిపించేది.

"నువ్వేమయినా యువరాణివా అలకనంద అనే పేరు పెట్టుకున్నావు" అంటూ స్నేహితురాళ్లు అసూయతో అడిగినప్పుడు--

"అవును... నేను పెద్దయ్యాక రాణినవుతాను" అంటూ గర్వంగా చెప్పేదాన్ని.

అన్నట్లుగా రాణిని కాలేకపోయినా 'మిస్ హైదరాబాద్'గా సెలెక్ట్ అయి సిటీలోని టాప్ మోడల్స్‌లో ఒకదాన్నయిపోయాను. అసలు మోడలింగ్ రంగంలో అడుగుపెడతానని కలలో కూడా అనుకోలేదు. అనుకోకుండానే నాజీవితం రంగుల ప్రపంచానికి అంకితం అయిపోయింది. ఎప్పుడూ ఫ్లాష్‌కెమెరాల ముందు మేకప్‌తో బిజీగా గడిపే నాకు సంక్రాంతి పండగ అంటే ఇప్పటికీ ఇష్టమే!

అందుకే అలవాటు ప్రకారం సంక్రాంతి అనగానే కోనసీమ కలలోకి వచ్చింది. చిన్నగా నిట్టూర్చి మళ్లీ పడుకోవడానికి ప్రయత్నించాను. కానీ నిద్రరాలేదు. తన చిన్ననాటి నేస్తం గౌతమ్ ఎలా ఉన్నాడో! మానవసంబంధాలు యాంత్రికంగా మారిపోయిన ఈ ఆధునిక యుగంలో మునుపటిలా పండగలకు, పబ్బాలకు బంధువులు, అందరూ కలవడం అరుదైపోయింది. గౌతమ్ కూడా ఇంజనీరింగ్‌లో చేరాడని చాలా ఏళ్ల క్రితం విన్నాను. తరువాత అతని వివరాలు తెలియరాలేదు. నాన్నగారికి, అత్తయ్యకు మధ్య ఆస్తి తగాదాలు వచ్చి వాళ్ల కుటుంబంతో కొన్నేళ్లుగా మాటలు లేవు. రాకపోకలు లేవు. ఈ మధ్య అప్పుడప్పుడు మామయ్య వచ్చి తమ ఇంటికి వచ్చి వెళుతూ ఉంటాడు అంతే!

గౌతమ్ గుర్తుకురాగానే చప్పున లేచి నా అల్మారా దగ్గరకు వెళ్లాను. పుస్తకాల అడుగున ఉన్న పాత పుస్తకాన్ని పైకి తీశాను. అట్ట ఊడిపోయి, పేజీల రంగు మాసిపోయి చిరిగిపోతూ జీర్ణావస్థలా ఉన్న పుస్తకం అది. దాన్ని చేతిలోకి తీసుకున్నాను. దాన్ని అంటిన దుమ్ముకు దగ్గు వచ్చేసింది. కళ్లలో నీళ్లు తిరిగాయి. నెమ్మదిగా దుమ్ము దులుపుతూ పుస్తకం పేజీలు తిరగేశాను. అందులో నుండి బయటపడిన దాన్ని చూడగానే నా మనసు రెపరెపలాడింది.

రంగు వెలిసిపోయినా అందం చెదరిపోని నెమలికన్ను... దాన్ని చూడగానే తీపిజ్ఞాపకాలు ఎన్నో...

తాతయ్యగారి ఇంటి వసారా మీద ఉన్న పురివిప్పిన నెమలి. దాని విన్యాసాన్ని వింతగా చూస్తూ కేరింతలు కొట్టే తనను చూస్తూ "నందా నీకా నెమలి ఈక కావాలా?" అనడిగాడు గౌతమ్. "అవును... కావాలి... ఒక్కటి కాదు... చాలా కావాలి. మా ఊరికి తీసుకెళ్లి మా తాతగారింట్లో నెమలి ఈకలు ఇవి అంటూ మా ఫ్రెండ్స్ దగ్గర గొప్పగా చెప్పుకోవాలి" అన్నాను నేను.

అంతే! మరునాటికంతా నెమలి ఈకలతో గౌతమ్ తయారు.

"ఇన్ని ఈకలు ఎలా తెచ్చావ్?" సంభ్రమంగా అడిగింది తను.

"నువ్వు అడిగితే ఇవేనేమిటి? ఇంకా ఎన్నయినా తెస్తాను..." గర్వంగా అంటున్న గౌతమ్ ఆక్షణంలో నాకంటికి మెగాస్టార్ చిరంజీవి కంటె గొప్పవాడుగా కనిపించాడు.


ఆ వయసు అలాంటిది. ఆ క్షణంలో గౌతమ్ తనకెంతో నచ్చాడు. గౌతమ్ ఇచ్చిన నెమలి ఈకల్ని క్లాసులో తన ఫ్రెండ్స్‌కు ఇస్తూ "మా గౌతమ్ ఇచ్చాడు" అంటూ గర్వంగా చెప్పింది. అన్నిట్లో బాగా పెద్దదిగా ఉన్న ఒక మంచి నెమలిఈకను తను దాచుకుంది. దాన్ని చూసినప్పుడల్లా గౌతమ్‌ను చూసినట్లే ఉండేది.

చిన్నగా నిట్టూరుస్తూ ఆ ఈకను నెమ్మదిగా చేతిలోకి తీసుకున్నాను. మృదుత్వం కోల్పోని ఆ ఈక నాచేతికి మెత్తగా తగిలింది.

"నువ్వు అడిగితే ఎన్ని ఈకలైనా తెస్తాను" గర్వంగా అంటున్న గౌతమ్ మొహం గుర్తుకువచ్చింది.

000

తెల్లవారింది. సంక్రాంతి పండగ. కానీ ఈ సిటీలో అన్ని పండగల్లాగే ఇదీనూ. దేవుడి పూజ. ఏవయినా స్వీట్లు అంతే! పూర్వంలా



పిండివంటలు చేసే ఓపిక అమ్మకూ తగ్గిపోయింది. పండగలొస్తే స్వీట్సు తెప్పించి ఫ్రెండ్స్‌కు పంచిపెట్టడం అలవాటై పోయింది. నాన్నమ్మ చేసే పులిహోర, చక్కెర పొంగలి, బొబ్బట్ల రుచులు తెలుసుకోవాల్సిందే! లేదా ఏ స్వగృహ ఫుడ్స్ వాళ్లకైనా ఆర్డర్ ఇచ్చి బొబ్బట్లు తినాల్సిందే!

పండగైనా ఆరోజు నేను బిజీగానే ఉన్నాను. ఉదయం పదిగంటలకు వెళ్లినదాన్ని సాయంత్రం తిరిగివచ్చాను. నేను వచ్చేటప్పటికి అమ్మ, నాన్న దేని గురించో తీవ్రంగా చర్చించుకుంటున్నట్లనిపించింది. ఏమై ఉంటుంది అని ఆలోచిస్తూనే రిఫ్రెష్ అయి హాల్లోకి వచ్చాను.

"అలకా... నీకు గౌతమ్ గుర్తున్నాడు కదూ..." అమ్మ అడిగిన ప్రశ్నకు ఉలిక్కిపడ్డాను.

గౌతమ్ గుర్తులేకపోవడం ఏమిటి? అసలు మరచిపోతే కదా... ఈ కృత్రిమపు పై పూతలు, రంగులు, ప్లాస్టిక్ పువ్వుల నవ్వుల మధ్య మనసు మండిపోతున్నా పెదాల మీద నవ్వు పులుముకుని నిత్యం నటించే తన మనసులో తీపి జ్ఞాపకాలు కోనసీమ స్మృతులే ఆ బాల్యం మళ్లీ రావాలనే తపన. రాదనే చేదు నిజం! రంగుల ప్రపంచంలోకి జీవితాన్ని నెట్టేసిన వాస్తవం... జీవితంలో కొన్ని కొన్ని మన ప్రమేయం లేకుండానే జరుగుతాయి అన్న వేదాంతధోరణికి తార్కాణం నా జీవితం. చిన్నప్పటినుంచి గౌతమ్‌ను పెళ్లి చేసుకుని మంచి గృహిణిగా మారాలనుకున్న నేను ఇలా మోడల్‌గా మారతానని కలలో కూడా అనుకోలేదు. నా అందం, శరీరసౌష్టవం డబ్బులు కురిపిస్తాయని గ్రహించిన నాన్న నన్ను ఇందులోకి దించాడు. ఎంత సంపాదించానో నాకే తెలీదు. తమ్ముడు, చెల్లెలి బాధ్యతలు తీరాయి. కానీ నేను పోగొట్టుకున్న మనశ్శాంతి ఖరీదెంతో కూడా నాకు తెలియదు. ఇంతకూ ఇప్పుడు గౌతమ్ ప్రసక్తి ఎందుకు వచ్చింది?

"గౌతమ్ గుర్తులేకపోవడం ఏమిటమ్మా.. అయినా ఇప్పుడు గౌతమ్ ప్రసక్తి ఎందుకు?" ఉద్వేగాన్ని కంఠంలో కనబడనివ్వకుండా ఉండాలని వ్యర్థ ప్రయత్నం చేశాను.


"ఎందుకంటే గౌతమ్. కాలిఫోర్నియాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా చేస్తున్నాడట... ఇంకో వారం రోజుల్లో రాబోతున్నాడు. ఇక్కడ నెలరోజులుంటాడట... మీ మామయ్య కొన్ని సంబంధాలు చూసి ఉంచాడు. గౌతమ్ వచ్చాక వాళ్లలో ఎవరైనా నచ్చితే చేసుకుని అమెరికాకు వెళ్లిపోతాడట. నీ ఫోటో కూడా మామయ్యకు ఇచ్చాను. అయినా నీ ఫోటో ఇవ్వాలా ఏమిటి? నీ గూర్చి గౌతమ్‌కు తెలీదూ..." నా పెళ్లి చెయ్యాలనే ఆరాటాన్ని అమ్మలో చూశాను. తరువాత అమ్మనాన్న మాటలు వినిపించడం మానేశాయి. తనెవరో గౌతమ్‌కు తెలియదూ... 'నీకోసం ఏమైనా చేస్తాను' అనే గౌతమ్. తనను పెళ్లి చేసుకోలేడా?... తప్పక చేసుకుంటాడు.

మనసులో మంగళవాద్యాలు... కళ్లలో పెళ్లిపందిరి... తెల్లని పట్టుచీర. బుగ్గన నునుసిగ్గుల దిష్టిచుక్కతో మెరిసిపోతూ తను గౌతమ్ పక్కన పెళ్లిపీటల కూర్చునే దృశ్యం రకరకాలుగా తన కళ్లకు కనిపిస్తోంది.

'గౌతమ్ ఎన్ని చిందులేసినా ఈ అలకనంద కలిసిపోయేది నీ హృదయమనే సాగరంలోనే!' అనుకున్నాను.

ఆరోజు నుండి ఎన్నో కలలు.

"ఏమిటి నందా... ఈ మధ్య మీరు పరధ్యానంగా ఉంటున్నారు. అనుకున్న ఎక్స్‌ప్రెషన్ రావడంలేదు" అంటున్న ఫోటోగ్రాఫర్ అరవింద్ మాటలతో నా మనసును చిక్కబట్టుకుంటున్నాను. అరవింద్ చాలా మంచి ఫోటోగ్రాఫర్. అంతే కాదు మంచివ్యక్తి కూడా! ఈ రంగుల ప్రపంచంలో తనలాగే అతడూ ఇమడలేక కేవలం పొట్టకూటి కోసం ఈ వృత్తిని స్వీకరించిన వ్యక్తి. తన అందాన్ని మరింత అందంగా అతని కెమెరాలో చూపడానికి ప్రయత్నిస్తాడు. తన యాడ్స్‌కు అన్నిటికీ అతనే ఫోటోగ్రాఫర్. యూనిట్‌లో అందరికంటె అతనితోనే తనకు చనువు ఎక్కువ.




"మీరు ఇలా మోడల్‌గానే మిగిలిపోకుండా సినిమాల్లో ఎందుకు ప్రయత్నించకూడదు" అనేవాడు.

"ఇదొక చిన్న మాయాప్రపంచం... అదొక పెద్దమాయా ప్రపంచం. అంతే! ఇక్కడే ఇమడలేని నేను అక్కడ అసలు బ్రతకలేను. ఒక్కోసారి ఇవన్నీ వదిలేసి మా కోనసీమకు వెళ్లి ప్రశాంతంగా బ్రతకాలని ఉంటుంది." అనేదాన్ని.

"అంత బాగుంటుందా మీ కోనసీమ'" అనడిగేవాడు.

"మాటలతో వర్ణించలేను. ఆ అందాలను చూడాల్సిందే.." అనేదాన్ని.

మనసుకెంత సర్దిచెప్పుకున్నా తనకళ్లలో ప్రతిఫలించే సంతోషం, తన మొహంలోని ఆనందం చూసి "ఎనీథింగ్ స్పెషల్" అనడిగాడు అరవింద్.

చెప్పకూడదనుకుంటూనే అతనికి గౌతమ్ గూర్చి చెప్పాను. అంతా విన్న తరువాత మీ బాల్యం గూర్చి వింటుంటే ఎంత రొమాంటిక్‌గా ఉందో తెలుసా? ఎనీహౌ బెస్టాఫ్ లక్" అన్నాడు.

ఎదురు చూసిన రోజు రానే వచ్చింది. గౌతమ్ ఇండియాకు వచ్చేశాడు. 'ఈరోజు వస్తాడు, రేపు తమ ఇంటికి వస్తాడు' అనుకుంటూ ఆశతో ఎదురుచూస్తున్న మా అందరి ఆశలకు పిడుగుపాటులాంటి వార్త తెలిసింది.

మామయ్య వచ్చి గౌతమ్ పెళ్లి శుభలేఖ ఇచ్చి వెళ్లాడు.

"అమ్మాయి కంప్యూటర్ ఇంజనీర్. పైగా కోటీశ్వరుని కూతురు. నాకంటె అన్నిట్లో అధికురాలు..."

ఆ శుభలేఖ చూడగానే నాకళ్లు మసకబారాయి. గౌతమ్ తెలివైన నిర్ణయం తీసుకున్నాడు. ఈరోజుల్లో అన్నీ ఆర్థిక సంబంధాలే కాబట్టి లాభనష్టాల గూర్చి ఆలోచించే ఈ పెళ్లికి అంగీకరించి ఉంటాడు. అతనికోసం కళ్లలో వత్తులు వేసుకుని ఎదురుచూసే ఈ పిచ్చిపిల్ల వలన ఏం లాభముంటుంది? ఎంత ఓదార్చుకున్నా మనసు, కళ్లు

## ఊర్మిళను నమ్మనంటూంది!

ఇం కెవరు, సాక్షాత్తూ బాలీవుడ్ విలన్‌గా విశేషకీర్తిప్రతిష్ఠలు ఆర్జించుకున్న ఆశుతోశ్‌రాణా భార్య, రేణుకే! తనకు సినిమాలు లేకపోవటంతో అంత పెద్దింట్లో తనొక్కతే వుండటం వల్ల నష్టమే అని తెలుసుకున్న ఊర్మిళామాతోండ్కర్, ఆశుతొష్‌ను తన ఇంట్లో అద్దెకుండేందుకు పిలిచిందిట. అతనికి కూడా మంచి పెద్ద



పోర్షన్ కావాలి కనుక వచ్చి చేరాడు. అంతా బాగానే వుంది కానీ ఈ మధ్యే ఊర్మిళకు, ఎప్పటికప్పుడు కొత్తవారికి వలలు వేయటంలో ఆరితేరిందనే పేరొచ్చిందనే వార్త వినిపిస్తూంది. "నా భర్త మీద నాకు నూటికి నూరు పాళ్లూ నమ్మకమే. కానీ... ఊర్మిళ సంగతే ఆలోచించాల్సివుంది" అంటూంది నెమ్మదిగా రేణుక. మరి ఊర్మీబేబీ ఏమంటుందో?

ఎస్.

చెమ్మగిల్లుతూనే ఉన్నాయి.

పెళ్లికి వెళ్లకపోతే బాగుండదని అందరం పెళ్లికి వెళ్లాము. తనను చూడగానే "హల్లో మోడల్‌రాణీ ఎలా ఉన్నావు?" అంటూ పలకరించాడు.

అతనికి చిన్ననాటి సంగతులేవీ జ్ఞాపకం ఉన్నట్లు లేవు... ఎందుకుంటాయి? అతనిప్పుడు అమెరికాలో ఇంజనీరు కదా!

అందరూ అటు వెళ్లగానే ఒక కవరు అతని చేతికిస్తూ "గౌతమ్... నీ పెళ్లికి నా స్పెషల్ ప్రజంటేషన్" ఎంత మామూలుగా అందామనుకున్నా నాగొంతు వణికింది.

అతడు చిత్రంగా నావైపు చూస్తూ "అంత స్పెషల్ గిఫ్టా... ఏమిటబ్బా..." అంటూ కవర్ తీశాడు.

చప్పున జారిపడింది నెమలి ఈక!

దాన్ని చూడగానే అతని కనుబొమలు ముడివడ్డాయి. ఒక్క క్షణం ఆశ్చర్యంగా అలాగే చూశాడు.

నేను ఆత్రంగానే అతడినే చూస్తున్నాను.

కిందపడిన నెమలిఈకను తీసి కవర్లో పెడుతూ "ఇదా నీ గిఫ్ట్ సిల్లీగర్ల్..." అంటూ పకపక నవ్వాడు.

అతడలా ఎగతాళిగా నవ్వుతుంటే నా కళ్లలో నీళ్లు తిరిగాయి. పదిహేనేళ్లుగా నేను అతిభద్రంగా దాచుకున్న నా పాతజ్ఞాపకాన్ని అతడంత తేలికగా తీసిపారేస్తాడనుకోలేదు. అతనికి సెంటిమెంట్స్ లేవా?

"గౌతమ్... ఎందుకా నవ్వు?... నీకు మన బాల్యం గుర్తుకు రావడంలేదా?" అనడిగాను.

"గుర్తుకొస్తోంది... కానీ నేను నీలా ఫూల్‌ను కాను. చిన్నప్పుడు ఏదో ఆటల్లో ఆడుకున్న ఇలాంటి పిచ్చిదాన్ని అంత గొప్ప వస్తువుగా ఇన్నేళ్లు దాచుకున్న నీ ఓపికకు మెచ్చుకోవాలి... ఇప్పుడు కూడా దీన్ని నువ్వే దాచుకో..." నవ్వుతూ తన చేతికే ఇచ్చేశాడు.

"నెమలి కన్ను పిచ్చిది! నిజమే! అదీ పిచ్చిది... దాన్ని పదిలంగా అపురూపమైన జ్ఞాపకంలా దాచుకున్న తనూ పిచ్చిది..."

000

దాదాపు నెలరోజులుగా తన బయటి ప్రపంచమే తెలియకుండా బాధపడుతూనే గడిపింది. ఎందుకో జీవితం అంటేనే విరక్తి కలిగింది.

తనను పలకరించడానికి వచ్చిన అరవిందే తనను ఓదార్చసాగాడు.

"ఏం చెయ్యను? ఈ మనుష్యుల మధ్య నేను బ్రతకలేను.."

"అది మీ పిరికితనాన్ని... జీవితంలో మీ ఎస్కేపిజాన్ని తెలుపుతోంది. ఒకడు లేకపోయినంత మాత్రాన మీకు జీవితమే లేదా? మన జీవితం ఎవరికోసమూ కాదండీ... మన కోసమే..."అంటూ అతడు ఎన్నో విధాలుగా ఓదార్చాక కాస్త కుదుటపడ్డాను. అతని మాటలు నిజమే అనిపించాయి.

'నిజమే! నా జీవితం... నాకోసమే' అనుకున్నాను.

'అలకా... మీ గుర్చి నాకు పూర్తిగా తెలుసు. నా గూర్చి మీకు తెలుసు. నాకు ముంబాయిలో పెద్ద యాడ్ కంపెనీలో ఫోటోగ్రాఫర్‌గా ఆఫర్ వచ్చింది. ఇంకో పదిహేనురోజుల్లో వెళ్లిపోతాను. మీకు అభ్యంతరం లేకపోతే మనం పెళ్లి చేసుకుందాం... మన ఇద్దరి భావాలు ఒకటే కాబట్టి మన జీవితం సవ్యంగా సాగుతుందని నా నమ్మకం" అన్నాడు.

అతని మాటల గుర్చి బాగా ఆలోచించసాగాను. 'మనం ప్రేమించిన వ్యక్తి కంటె మనల్ని ప్రేమించిన వ్యక్తి దగ్గరే సుఖపడతామని పెద్దలు ఎప్పుడో చెప్పారు'

"ఏమంటావు అలకా?... నీకు నాతో పెళ్లి ఇష్టం లేదా?" అతడు అడుగుతున్న ప్రశ్నకు సమాధానంగా లేచాను.

నా పాతపుస్తకంలోని నెమలికన్నును తీసి కిటికీలో నుంచి విసిరేశాను. అది గాలికి ఎగురుతూ ఎటో వెళ్లిపోసాగింది. ఎగురుతున్న నెమలికన్నును చూస్తున్న నాభుజం మీద అరవింద్ చెయ్యి ఓదార్పుగా తాకింది. ■